క్లుప్తంగా

ముదిరాజ్ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ



పాలమూరు: మహబూబ్‌నగర్ ముదిరాజ్ ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం పట్టణంలోని తెలంగాణ చౌరస్తాలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ నేత, న్యాయవ్యాది ఎన్‌పీ వెంకటేష్, కాంగ్రెస్ నేత సంజీవ్‌ముదిరాజ్‌లు హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఏఓ శంకర్, డాక్టర్ శ్రీనివాసరాజు, సంఘం కార్యదర్శి విజయ్‌బాబు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ



చిన్నచింతకుంట: నూతన సంవత్సరం వేడుకలను పురస్కరించుకొని స్థానిక మండల కేంద్రంలో సామాజికవేత్త దండు వెంకటేష్ వృద్ధులకు, వితంతులకు దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం కేకును కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సమాజ సేవ చేయడం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మోషే, బషీర్‌అహ్మద్, భక్తరాజు, ఎంకే విజయ్, క్రాంతి, అదిత్య, శ్రీకాంత్, రవితేజ తదితరులు ఉన్నారు.

క్లాస్‌మేట్ క్లబ్ అధ్యక్షుడిగా సంజీవ్‌కుమార్

జడ్చర్ల: స్థానిక డివిజన్ క్లాస్‌మేట్ క్లబ్ అధ్యక్షుడిగా బాదం సంజీవ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో క్లాస్‌మేట్ క్లబ్ రూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ ప్రకటించారు. ప్రధానకార్యదర్శిగా శ్రీనువాసులు, కోశాధికారిగా రాఘవేందర్, పీఆర్‌ఓగా నరేష్, తదితరులను కార్యవర్గ సభ్యులుగా నియమించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. పలు సామాజిక సేవ కార్యక్రమాలను నిర్వహించి క్లబ్ ఔన్నత్యాన్ని చాటుతామని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా నాయకులు రామక్రిష్ణ, ప్రవీన్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



భూత్పూర్: మండలంలోని కప్పెటకి చెందిన వడ్డె మల్లేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. ఆదివారం బాధితుడి భార్య ప్రశాంతికి అదే గ్రామానికి చెందిన మేస్త్రీలు రూ.12వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ మేరకు వైస్ ఎంపీపీ నరేష్ గౌడ్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కప్పెట మేస్త్రీల సంఘం నాయకులు కృష్ణయ్య, గోపాల్, వెంకటరాములు, నర్సింహులు, తిరుపతయ్య, చెన్నకేశవులు, యాదగిరి, మేస్త్రీలు ఉన్నారు.

వాసవీ, వనితా క్లబ్ కార్యవర్గాల ఎన్నిక



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో ఆదివారం వాసవీ, వనితా క్లబ్‌ల నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడిగా వలకొండ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా వినోద్, కోశాధికారిగా గుబ్బ రాంచంద్రయ్యలను ఎన్నుకున్నారు. అదే విధంగా వనితా క్లబ్ అధ్యక్షురాలిగా శ్రీదేవి, ప్రధాన కార్యదర్శి ఎదిరే రాధిక, కోశాధికారిగా లావణ్యలను ఎన్నుకున్నారు.

వేర్వేరు చోట్ల రైలు ఢీకొని ఇద్దరి మృతి

మహబూబ్‌నగర్ క్రైం: రైలు పట్టాలు దాటుతున్న ఓ వ్యక్తి ని రైలు ఢీకొనడంతో మృతిచెందాడు. రైల్వే ఎస్‌ఐ అక్బర్ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని ఏనుగొండకు చెందిన కమ్మరి శ్రీనివాసులు(46) ఆదివారం ఏనుగొండ సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై రైల్వే స్టేషన్ మాస్టర్ నిషాంత్ శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అలాగే రాజాపూర్ మండలంలోని ముదిరెడ్డిపల్లికి చెందిన శివప్రసాద్(19) బాలానగర్– గొల్లపల్లి సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతిచెందాడు.

కిక్కిరిసిన ఆలయాలు

- అట్టహాసంగా నూతన సంవత్సర సంబరాలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



మీనాంబరం పర్శవేదీశ్వర ఆలయంలో బారులు తీరిన భక్తులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకొని జిల్లాలో ఆదివారం పండుగ వాతావరణం నెలకొంది. ఇళ్ల ముందు వివిధ ఆకృతుల్లో రంగవల్లులతో అలంకరించారు. వాటి మధ్యలో 'వెల్‌కం న్యూయర్–2023' అక్షరాలు వచ్చేలా ముగ్గులను తీర్చిదిద్దారు. కుల, మతాలకతీతంగా నూతన సంవత్సర కేక్‌లు కట్ చేసి ప్రజలు గ్రీటింగ్స్ తెలుపుకున్నారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని దేవాలయాలను భక్తులు దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్టియన్‌కాలనీలో ప్రార్థనా మందిరంలో న్యూ ఇయర్ ప్రార్థనలు చేశారు. పాస్టర్ జ్ఞానేష్ వాక్య సందేశం ఇచ్చారు. ప్రజల క్షేమం కోసం ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సువర్ణ డేవిడ్, రీతు, స్వాతి, వేరోనికా, జైసిలా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..

జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నూతన సంవత్సరం వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి కేక్‌కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు.

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రధాన దేవాలయాలన్ని భక్తులతో రద్దీగా మారగా ఎంబీ బేథని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ధర్మశాస్త అయ్యప్పదేవాయంలో పడిపూజ నిర్వహించి అన్నదానం చేశారు. జాతీయరహదారిపై గొల్లపల్లి వద్ద ఉన్న లలితాంబికాదేవాలయంలో వేలాదిమంది భక్తులు అమ్మవారిని, శ్రీచక్రాన్ని సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో ఒక్కరోజే 10వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ నిర్వాహకులు సర్వేశ్వరానందగిరిస్వామి తెలియజేశారు. పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, మండలంలోని మీనాంబరం పర్శవేదీశ్వరస్వామి, గంగాపూరం లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.

నవాబుపేట: మండల పరిధిలోని మైసమ్మ దేవాలయం, గురుకుంట గ్రామ సమీపంలో ఉన్నా షిర్డీ సాయి దేవాలయంలో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

మహమ్మదాబాద్/గండేడ్: ఉమ్మడి మండలాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నూతన సంవత్సరం కావడంతో ఆయా గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున ఆలయాలకు తరలివెళ్లారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మండల పరిధిలోని మహమ్మదాబాద్ అయ్యప్పకొండపై, గంగర్లపాడు హనుమాన్ ఆలయం, నంచర్ల, గాధిర్యాల్, గండేడ్, వెన్నాచేడ్, సల్కర్‌పేట్ తదితర గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు నూతన సంవత్సర సందడి చేశారు.

బాలానగర్: మండల కేంద్రంతోపాటు పెద్దరేవల్లి, ఉడిత్యాల, తిరుమలగిరి, నేరళ్లపల్లి, పెద్దాయపల్లి తదితర గ్రామాల్లో ఆలయాలకు పోటెత్తారు. ప్రధానంగా బాలానగర్ దుందుబీతీరంలో ఉన్న అయ్యప్ప ఆలయప్రాంగణంలో సర్వదేవతా మూర్తులు ఉండడంతో మండల కేంద్రంతోపాటు పరిసర గ్రామాల ప్రజలు వందల సంఖ్యలో ఆలయానికి వచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణాలు భక్తులతో కటికిటలాడింది.



అయ్యప్ప ఆలయంలో హారతి తీసుకుంటున్న భక్తులు



నవాబుపేట సాయి దేవాలయంలో జన జాతర



మైసమ్మ దేవాలయంలో...



క్రిస్టియన్‌కాలనీలో ప్రార్థనా మందిరంలో భక్తిగీతాలు ఆలపిస్తున్న మహిళలు



జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కేక్‌కట్ చేస్తున్న అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి



అమ్మవారి సందర్శనకు వేచి ఉన్న భక్తులు



లలితాంబికాదేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ప్రజా సేవలోనే కొనసాగాలి



నవాబుపేట: ప్రజలకు సేవ చేసేందుకు ముందుకు వచ్చిన కాంగ్రెస్ యువ నాయకుడు మరింత ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్యే, పీసీసీ ఉపాధ్యక్షుడు ఎర్ర శేఖర్ అన్నారు. ఆదివారం డీసీసీ ప్రధాన కార్యదర్శి బంగ్ల రవి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో అభిమానులు గజమాలతో సన్మానించి కేక్ కట్‌చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువ నాయకులు సేవ కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం పేదలకు దుప్పట్లు, అనాథ పిల్లలకు దుస్తులు అందించి ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు రంగారావు, జిల్లా నాయకులు జహీర్, ఖజా, రాజేష్, రాంచంద్రయ్య, శ్రీహరి, నీల్యానాయక్, రమేష్, అజహర్, సమియుల్లా, నర్సింహులు పాల్గొన్నారు.

బైరి నరేష్‌ను శిక్షించాలి



ధర్నా చేస్తున్న అయ్యప్ప స్వాములు

చిన్నచింతకుంట: బైరి నరేష్‌పై కేసు నమోదు చేసి వెంటనే శిక్షించాలని మండలంలోని కురుమూర్తి గ్రామ సమీపంలోని ఆత్మకూర్, దేవరకద్ర రహదారిపై ఆర్‌ఎస్‌ఎస్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు రాము మాట్లాడుతూ బైరి నరేష్ అయ్యప్ప స్వామి, హిందు దేవులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. వెంటనే బైరి నరేష్‌ను అరెస్ట్ చేసి పీడీయాక్ట్ నమోదు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి



మాట్లాడుతున్న డీసీసీబీ వైస్ చైర్మన్ కోరమోని వెంకటయ్య

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక ఐదో వార్డు ఏనుగొండ పరిధిలోని రామకృష్ణకాలనీలో ప్రజలందరూ సమష్టిగా సహకారం అందిస్తే 15 రోజుల్లోనే డ్రెయినేజీ సమస్యను పరిష్కరిస్తామని డీసీసీబీ వైస్ చైర్మన్ కోరమోని వెంకటయ్య హామీ ఇచ్చారు. ఆదివారం ఈ కాలనీలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇప్పటికే వీధి లైట్లు, బీటీరోడ్లను ఏర్పాటు చేశామన్నారు. కొత్తగా ఏర్పడుతున్న కాలనీల్లో దశలవారీగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కోరమోని వనజ, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బోగుల బాలరాజు, కార్యదర్శి దశరథం, సభ్యులు కిషన్‌దాస్, కోరమోని సత్యం, రాజేశ్‌కుమార్, పవన్‌కుమార్, గుముడాల చక్రవర్తిగౌడ్, నర్మద, వరలక్ష్మి, నీరజ తదితరులు పాల్గొన్నారు.

20 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు

జడ్చర్ల: పట్టణంలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా శనివారం రాత్రి ప్రత్యేకంగా డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించినట్లు సీఐ రమేశ్‌బాబు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 20 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వాహనాలను స్వాధీనం పర్చుకుని సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేశామన్నారు. ఇకనుంచి పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్ తరుచుగా నిర్వహిస్తామని, వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపొద్దని కోరారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు అందరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

గోపురం పనులు ప్రారంభం



దేవరకద్ర: మండల కేంద్రంలోని వందేళ్ల చరిత్ర కలిగిన శివాలయం నూతన గోపుర నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. పాత గోపురం శిథిలావస్థకు చేరడంతో దాన్ని కూల్చివేసి కొత్తగా గోపురం నిర్మాణ పనులను దేవస్థానం వారు చేపట్టారు. అలాగే వందేళ్ల క్రితం నిర్మించిన వీరప్పయ్యస్వామి దేవాలయం గోపురాన్ని కూడ పూర్తిగా తొలగించి నూతన గోపురం పనులకు శ్రీకారం చుట్టారు. గోపురాల నిర్మాణానికి పలువురు దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేస్తున్నారని దేవస్థాన కమిటీ చైర్మన్ శివానంద్ తెలిపారు.

క్రీడాకారులకు అధిక ప్రాధాన్యత



టోర్నీని ప్రారంభిస్తున్న రైతుబంధు మండల అధ్యక్షుడు మల్లు దేవేందర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: మండల పరిధిలోని కోటకదిరలో దివంగత మన్యంగౌడ్ స్మారక జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ముందుగా రైతుబంధు మండల అధ్యక్షుడు మల్లు దేవేందర్‌రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని అన్నారు. చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే భవిష్యత్తులో విద్యతో పాటు ఉద్యోగాల్లో కూడా స్పోర్ట్స్ కోటా ద్వారా అత్యుత్తమ ఫలితాలు పొందవచ్చని అన్నారు. గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని, క్రీడా నైపుణ్యాలను అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన జట్టుకు ప్రథమ బహుమతి కింద రూ. 25 వేలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లు రమ్య, మండల కోఆప్షన్ సభ్యుడు ఎండీ మస్తాన్, ఉప సర్పంచ్ మునీర్, మన్యంగౌడ్ , మాణిక్యమ్మ, నాగలక్ష్మి, రామచంద్రయ్యగౌడ్ పాల్గొన్నారు.

బీమాకోరేగావ్ స్మారక స్తూపం సందర్శన



బీమాకోరేగావ్ స్మారక స్తూపం వద్ద నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: మహారాష్ట్రలోని పూణె జిల్లాలో గల బీమాకోరేగావ్ స్మారక స్తూపాన్ని మాల మహానాడు నాయకులు సందర్శించారు. మహర్ల శౌర్య విజయోత్సవ దినాన్ని పురస్కరించుకుని మాల మహానాడు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కానుగడ్డ యాదయ్య, రాష్ట్ర రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాలరాజు, రాష్ట్ర కార్యదర్శి మిట్టమీది బాలరాజు, ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డబ్బా రాములు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు దర్శించుకున్నారు. మహర్లు 1818 సంవత్సరంలో 500 సైన్యంతో 30 వేల పిశ్వ సైన్యాన్ని 12 గంటలు నిరంతరాయంగా ఆపకుండా పోరాడి విజయం సాధించారని, అందుకోసమే జనవరి 1న మహర్ల విజయ దినోత్సవంగా జరపడం ఆనవాయితీగా వస్తుందని కానుగడ్డ యాదయ్య తెలిపారు.

కరాటే బెల్టు గ్రేడింగ్‌లో విద్యార్థుల ప్రతిభ



బెల్టులు పొందిన విద్యార్థులతో కరాటే మాస్టర్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గం జక్లేర్‌లో ఆదివారం డ్రాగన్ షోటోకాన్ కరాటే డూ ఇండియా ఫౌండర్ సాలాంబిన్ ఉమర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలో మహబూబ్‌నగర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి వివిధ బెల్టులు సాధించినట్లు డ్రాగన్ షోటోకాన్ కరాటే డూ ఇండియా జిల్లా అర్బన్ అధ్యక్షుడు, కరాటే మాస్టర్ ఎస్‌కే.మోసీన్ తెలిపారు. ఈ పోటీల్లో 20 మంది జిల్లా విద్యార్థులు పాల్గొనగా 10 మంది ఎల్లో బెల్టు, ఇద్దరు విద్యార్థులు గ్రీన్, ఇద్దరు ఆరెంజ్, ఒకరు బ్లూబెల్టులు పొందినట్లు తెలిపారు. బెల్టులు సాధించిన విద్యార్థులను డ్రాగన్ షోటోకాన్ కరాటే డూ ఇండియా ఫౌండర్ సాలాంబిన్ ఉమర్, చీఫ్ ఎగ్జామినర్ అమ్రేష్, కార్యదర్శి షేక్ అబ్దుల్ సలాం, హైదరాబాద్ అధ్యక్షుడు అర్బాత్, కరాటే మాస్టర్ ఎస్‌కే.మోసీన్‌లు అభినందించారు.

బిల్లులు ఏమయ్యాయి?

- ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసి రెండేళ్లైనా అందని వైనం
- చేతులెత్తేసిన అధికారులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న సర్పంచ్‌లు



రేకుల చౌడాపూర్ ఇంకుడుగుంత

నవాబుపేట: గ్రామాలను సంపూర్ణ పారిశుద్ధ్య గ్రామాలుగా మార్చాలని పోటీపడి ఇంకుడుగుంతలు, మరుగుదొడ్లు నిర్మాణం చేశారు. తీరా వాటి బిల్లుల విషయానికి వచ్చేసరికి అధికారులు చేతులెత్తేశారు. దీంతో వాటిని నిర్మించిన ప్రజాప్రతినిధులు బిల్లుల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సి వస్తుంది. మండలం మొత్తం దాదాపుగా రూ.కోటికి పైగానే బిల్లులు బకాయిలు ఉన్నట్లు తెలుస్తుంది. మండలంలోని వివిధ గ్రామాల్లో మొత్తం దాదాపుగా 10 వేలకు పైగా ఇంకుడు గుంతలు నిర్మించారు. అయితే వాటిని పూర్తి చేల్సిన బాధ్యత సర్పంచ్‌లకు అప్పగించడంతో వారు అప్పటి కలెక్టర్ రోనాల్డ్‌రోస్ ఆదేశాలతో అడ్వాన్స్‌లు తీసుకుని వాటిని నిర్మాణం చేశారు. కాగా వాటిని పూర్తి చేసేందుకు తీసుకొచ్చిన అప్పులు పెరగడంతో సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతున్నారు. కాగా అప్పటి అడ్వాన్సులు ఖాతాలో తిరిగి జమకావడంతో తమకు రావాల్సిన బిల్లులు మాత్రం రాకపోవడంతో సర్పంచ్‌లు తీవ్ర పాట్లు పడుతున్నారు. ప్రభుత్వం కచ్చితంగా టార్గెట్‌లు పెట్టి మరి వాటిని నిర్మించిన తరుణంలో బిల్లుల విషయంలో నిర్లక్ష్యం సర్పంచ్‌లకు నిద్రపట్టకుండా చేస్తుంది. అధికారులను బిల్లుల విషయంలో పలుమార్లు అడిగిన ఫలితం లేకపోవడంతో వారు పంచాయతీ పనులు చేసేందుకు జంకుతున్నారు.

- ➡ మండలంలో 42 గ్రామాల్లో నిర్మాణం చేసిన ఇంకుడుగుంతలు 10,289
- ➡ బిల్లులు చెల్లించినవి 6,500
- ➡ ఇంకా చెల్లించాల్సిన పెండిగ్ బిల్లులు 3,500
- ➡ ఒక్కోదానికి రూ.3,296, మొత్తం రూ.కోటి 15 లక్షల 36 వేల బకాయిలు చెల్లించాల్సి ఉంది.
- ➡ బిల్లులు పెరగటంతో పేచి

➡ ఇంకుడు గుంతలకు సంబంధించి గతంలో వాటిని నిర్మాణం కోసం ఒక్కోదానికి రూ.3,296 ప్రభుత్వం చెల్లించేది. కాగా తాజాగా వాటికి సంబంధించిన బిల్లును రూ.5,100లకు పెంచారు. దీంతో పెండింగ్ బిల్లులు పాత బకాయిల ప్రకారం ఇవ్వాలా లేక తాజాగా వాటిని లెక్కలోకి తీసుకోవాలా అనేదానిపై అధికారులు ఆలోచలో పడ్డారు. కాగా అధికారులు గ్రామాల్లో ఇంకుడుగుంతల నిర్మాణం కోసం అప్పట్లో మంజూరు ఇచ్చిన వాటిని పాత బిల్లులు వర్తిసాయి. కానీ చాలా వాటిని లెక్కలోకి తీసుకునేందుకు సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేశారు. దీంతో వారు గ్రామాల వారీగా సర్వే నిర్వహించి బిల్లులు చెల్లించాలంటే వాటికి పాత బిల్లులు ఇవ్వాలా లేక కొత్త బిల్లులు చేస్తే బిల్లులు మంజూరు అవుతయా అనేది వారికి సందేహంగా మారింది.

ఒత్తిడికి లోనవుతున్నాం



బిల్లులు రాకపోవడంతో ఒత్తికి లోనవుతున్నాం. గ్రామంలో 160 ఇంకుడు గుంతలు నిర్మాణం చేపట్టాం. వాటిని నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అప్పటి కలెక్టర్ రౌనాల్డ్‌రోస్ చెప్పడంతో వెంటనే వాటిని పూర్తి చేసేలా అప్పులు చేసి పనులు పూర్తి చేశాం. కానీ నేటికి కేవలం 52 ఇంకుడుగుంతలకు మాత్రమే బిల్లు వచ్చింది. మిగతా 108 బిల్లుల కోసం తిరుగుతున్న అధికారులు స్పందించడం లేదు. – సోనిబాయి, సర్పంచ్, ఊరంచుతండా

గ్రామాలవారీగా పరిశీలన

బిల్లుల విషయంలో గతంలో రెండు డిపార్టుమెంట్లు కలిసి ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టారని ఉపాధి హామీ ఏపీఓ జ్యోతి వివరించారు. అప్పట్లో వాటికి సంబంధించిన తీర్మాణం, పనుల పరిశీలన జరగకపోవడంతో వాటికి బిల్లులు మంజూరు కాలేదు. తాజాగా సర్పంచ్‌ల సూచనలతో నిర్మాణం చేసిన వాటిని మొత్తం పరిశీలన చేస్తున్నాం. మంజూరులో ఉండి నిర్మాణం పూర్తిచేసిన వాటికి బిల్లులు అందించేలా పనులు ప్రారంభించాం. – ఏపీఓ జ్యోతి

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ



మహమ్మదాబాద్‌లో అయ్యప్ప పడిపూజలో పడి వెలిగిస్తున్న స్వాములు

నవాబుపేట: స్వామియే శరణం.. అంటూ మండల పరిధిలోని అయ్యప్ప కొండ మార్మోగింది. ఆదివారం మండల పరిధిలోని యన్మన్‌గండ్ల సమీపంలో అయ్యప్ప కొండపై అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో మహాపడి పూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ గురుస్వామి చేతుల మీదుగా జరిగిన పడి పూజలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేపట్టిన అయ్యప్ప స్వామి పదునెట్టంబడి, కలశ ఊరేగింపు నవాబుపేట నుంచి ప్రారంభం కాగా అభరణాల ఊరేగింపు యన్మన్‌గండ్ల నుంచి చేపట్టారు. దీంతో ఊరేగింపు ఆకట్టుకుంది.

మహమ్మదాబాద్: మండల కేంద్రంలోని రాజశేఖర్‌గౌడ్ స్వగృహంలో ఆదివారం అయ్యప్ప మహాపడిపూజ ఘనంగా నిర్వహించారు. గురుస్వాములు శ్రీనివాస్, చెన్నయ్య, గోపాల్, బాల్‌రాజ్, పాండు నాయక్‌ల ఆధ్వర్యంలో మహాపడిపూజ నిర్వహించారు. ఉదయం 10గంటలకు ప్రారంభమైన పడిపూజ వినాయక, సుబ్రమణ్య స్వామి పూజ, అనంతరం అయ్యప్ప అభిషేకం, మెట్ల దీపారాధన, మహామంగళహారతి. అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు పాలెం శ్రీను, బాలు, గోవర్దన్, పెంటయ్య, శ్రీను, చెందు, శ్రీనివాస్, నర్సింలు, మహేందర్ స్వాములు పాల్గొన్నారు.

బాలానగర్: మండల కేంద్రం సమీపంలోని అయ్యప్ప ఆలయంలో ఆదివారం అయ్యప్ప పడిపూజ కనులపండుగగా జరిగింది. సర్పంచ్ దంపతులు విజయలక్ష్మి, తిరుపతి గురుస్వామి ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు శ్రీను, మహేందర్ రెడ్డి తదిరతులు తదితరులు పాల్గొన్నారు.



యన్మన్‌గండ్ల అయ్యప్ప కొండపై పడి పూజలో ఆకట్టుకున్న అలంకరణ